# మౌనలిపి

విహారిగారి 'మౌనలిపి' సాహితీ విమర్శకుల పరిభాషలో అయితే- యిది సామ్యవాద వాస్తవికత (సోషలిస్ట్ రియలిజం) అంటారు. మార్క్సిస్టు విమర్శకులు కానివారు- దీన్ని ఒక 'ఎపిఫని' అంటారు (అంటే ఆకస్మిక సాక్షాత్కారం). భారతీయ సాంప్రదాయం.

ఈ కథానికలో ప్రక్రియా సంబంధమైన కొన్ని 'అసామాన్యం' అనదగ్గ విశేషాలున్నాయి (అంటే టెక్నికల్ పాయింట్స్). ఒకటి నిజంగా యిది చిన్నకథ. రెండు ఎక్కడా అనవసర వాక్యంగాని, పొడిగింపు పదం గాని లేని- అరుదైన వచనకవిత వంటి కథనం. మూడు అందులో కథావస్తువు 'దరిద్ర దళిత బ్రాహ్మణుల జీవితం' (ఎవరికీ ఎందులోనూ పోటీకి రాకపోయినా, ఎంతో త్యాగపూరిత చరిత్ర వున్నా- బ్రాహ్మణ వ్యతిరేక రచనలూ, ఉపన్యాసాలూ, కొనసాగుతున్న కాలనేపథ్యం). నాలుగు- యీ కథలోని చిన్న చిన్న సంభాషణలు, వ్యాఖ్యానాలు అతిసహజంగా, యీ అశింగారిన మధ్యతరగతి ఇరుకువాడల్లోనే వినబడే భాషాప్రయోగాలి.

ఇటువంటి కథల్ని గోర్కీ, చెహోవ్, రావిశాస్త్రి, విలియం సారోయిన్, ఆత్మహత్య చేసుకొన్న హెమింగ్వే లాంటివారు రచించారు.

దారిద్ర్యం- అనే పదానికి నిర్వచనం యీ కథ. కథాంతంలో 'వదినె' ఆస్పత్రిలో సాక్షాత్కరించటం, ఓ హెన్రీ ఏ కొసమెరుపు కథలోనూ నాకు కన్పించలేదు. ఈ వదినె ఒక కరుణరసం. ఆ మరిది ఒక అసహాయ మానవుడు. ఈ చినుకు- అట్టి కథకు పట్టం కట్టడం ఒక గొప్ప విధినిర్వహణ.

- మునిపల్లె రాజు
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

బాల్యం...

రాసి పడేసిన నోట్‌బుక్!

వంకర గీతలూ, కుంటి రాతలూ, దిద్దుకున్న అక్షరాలూ! దాన్ని 'పారేసుకోవటం' ఒక అనివార్యమైన భౌతిక వాస్తవం.

అయినా ఆ రాతలూ, గీతలూ, అక్షరాలూ- అక్షరాలే! గుండెపొరల్లో నిక్షిప్తమయ్యే వుంటాయి. వర్తమానం దోసిట్లో నీళ్లవంటిది. అన్ని సంభవాలకీ ప్రత్యక్ష సాక్షి. ఐదువేళ్ల సందు నుంచీ జారిపోతుంటే... చూస్తూ నిలబడతాం.

ఆ గతం తరగని గని! ఎక్కడ తవ్వుకున్నా ఇంత మట్టి అంటుతూనే వుంటుంది. ఆకుపచ్చని జ్ఞాపకాలు చెప్పుకోవచ్చు. అనుభూతిని నెమరు వేసుకుంటూ వుండొచ్చు.

ప్రస్తుతం- కాల్చి వాతలు పెడుతూ వుంటుంది. ఎళ్లెళ్లని బాధా, వ్యధా. ఎవరు చూస్తారు? ఎవరు వింటారు? ఎవరికా ఓర్పూ, ఆసక్తీ వుంటాయి? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు!

ఇదీ సందర్భం... ఇదీ సందిగ్ధం!

●

నాన్న!

నా జీవితంలో ఆయన బతుకు నిండా ఏడెనిమిదేళ్లేమో... అంతే గుర్తు.

పగలంతా పక్కింటి షావుకారుగారి పెద్ద సింహాల మేడలో 'పని' చేస్తూ వుండేవాడు.

షావుగారికి పెట్రోలు బంకుంది. గుడ్డల షాపుంది. కలప డిపో వుంది, టూరిస్టు బస్‌లూ ఉన్నై.

ఓసారి అన్నయ్యనడిగా- "నాన్న ఉద్యోగం ఏమిటన్నయ్యా?" అని.

గ్రుడ్లురిమి చూశాడు. కోపమెక్కువ. "చదువు సున్నా కానీ, ఈ ఆరాలకేం తక్కువ లేదు. ఫో... పోయి చదువుకో!' అన్నాడు. చెప్పలేదు.

సావిత్రక్కయ్య నడిగాను. విసుక్కుంది. సీతక్క చెప్పింది- "షావుకారేం చెప్తే అది చెయ్యటమే... బోల్డు పనులు!" అన్నది.

"బోల్డు పనులు చేస్తుంటే 'కాస్త' జీతమే ఎందుకిస్తారక్కయ్యా?"

సీతక్కకీ కోపమొచ్చింది. చెల్లి సరళా, తానూ ఆమె వైపు బెరుగ్గా చూశారు.

"మనకేం కావాలన్నా జీతం చాలటం లేదంటాడుగా నాన్న!" మళ్లీ సందేహం.

అనసూయక్క చెప్పింది- "అదంతే లేరా!"

"అంతే అంటే?" ఈసారి ముగ్గురికీ కోపమొచ్చింది.

"వీడి కఖ్ఖర్లేని వ్యవహారం లేదు..." అని వెళ్లిపోయారు.

అన్నయ్య విన్నాడు- "కుంటి ప్రశ్నలూ, బోడి తెలివీ. చాల్లే... ఫో! కంచంలోకి ముద్ద రాకపోతే అప్పుడింకా చాలా విషయాలు అర్థమవుతాయ్ లే!' అన్నాడు.

●

ఎప్పుడూ అర్థంకాలేదు!

నాన్నకి టీ.బీ. వ్యాధి ముదిరితే సరయిన వైద్యం చేయించలేకపోయినప్పుడూ తెలీలేదు. అన్నయ్య విశ్వనాథం తనను కోప్పడి నాన్న దగ్గర పడుకోవద్దన్నప్పుడూ తెలీలేదు. నాన్న చనిపోతే అన్నయ్య నిత్యకర్మ చెయ్యలేక- పది, పదకొండు, పన్నెండు రోజుల కర్మకాండ మాత్రమే చేసినప్పుడూ అర్థంకాలేదు.

సావిత్రక్కయ్య రెండోపెళ్ళి వాడిని పెళ్ళి చేసుకున్నప్పుడూ అర్థమైందేమీ లేదు. ఇంటికి వదినొచ్చినా... వేరే గదిలేని కొంపలో అన్నయ్య చిరచిర లాడుతున్నప్పుడూ తెలీలేదు. పురోహితుడుగా అన్నయ్య యజమానులు చేతిలో పెట్టిన రూపాయో, రెండూ తెచ్చి వదిన ముందు బాధపడినప్పుడు- మళ్లీ అదే ప్రశ్న మెదడులో మొలిచింది... "అంత పని చేయించుకుని ఇంత తక్కువివ్వటం ఏమిటి?"

సమాధానం ఏమీ రాలేదు.

వదిన మాత్రం ఏమిటేమిటో అనేది- "ఖర్మ... గ్రహచారం!" అంటూ. అప్పుడప్పుడూ "తక్కువ నోములు నోచి ఎక్కువ ఫలాలు కావాలంటే వస్తయ్యా?" అనుకునేది.

ఆమెకి కొంచెం దగ్గరగా వెళ్లి చూస్తే... మొహాన్ని పక్కకి తిప్పుకుని కొంగుతో కళ్ళొత్తుకునేది.

సీతక్క పెళ్ళి జరిగి అత్తారింటికి వెళ్లేసరికే... వదిన స్వరాజ్యంని కన్నది.

అనసూయక్క పెళ్ళి తర్వాత- వదినకి రాజు పుట్టాడు.

●

కతెవరం వంతెన దాకా నడిచాను. రామలింగేశ్వరపేట నుంచి అసంకల్పంగా నడిపించినై కాళ్లు.

వంతెన మీద కూచున్నాను.

మనసు మనసులో లేదు. అన్నయ్య మాటలే తలపు కొస్తున్నాయి. వదిన విసుగుదలే సలుపుతోంది.

"నిజమే. నీ భార్యకి కాన్పు సమయం. డబ్బు కావాలి. కానీ నా అవస్థలు నాకున్నై. అవన్నీ చెప్పుకోలేను. చెప్పినా నీకర్థంకావు. నా వల్ల కాదు. నేనేం చెయ్యలేను" అన్నయ్య.

"మన పరిస్థితులన్నీ తెలిసి కూడా, తాడూ బొంగరం లేకుండానే వసంతని పెళ్ళి చేసుకొచ్చావ్. ఆ పిల్లకెవ్వరూ లేరు. కావాలని చేసుకున్నానన్నావ్. 'పోనీలే...' అనుకున్నాం. మాకు తోచిన విధంగా సహాయపడ్డాం. పిల్ల పుట్టింది, సంతోషించాం..." - వదిన.

"ఏదో భుక్తి కల్పించమని నెత్తిన కూర్చుంటే వాళ్ళ కాళ్లూ, వీళ్ళ కాళ్లూ పట్టుకుని ఆ గుడి పని అప్పజెప్పిస్తే- ఏంచేశావ్? బుద్ధిగా నిలబడ్డావా? లేదు. ఏడాది తిరిగేసరికి నోటిముందు కూడు వదులుకుని వచ్చేస్తివి... గూడూ, నీడా పోయె!"

అవును... వచ్చేశాడు. ఎందుకని? గుడి ధర్మకర్త హారతిపళ్ళెం పైసలు కూడా నిలబడి మరీ వసూలు చేసుకుపోతూ నెలకో వంద చేతిలో పెడుతుంటే- 'మరీ ఇంత తక్కువైతే ఎలా?'గని అడిగితే ఏమన్నాడు? 'ఉంటే ఉండు, నీవల్ల కాదంటే వెళ్లమన్నాడు.

నిజానికి నాన్న జీతం గురించి తాను చిన్నప్పుడు వేసిన ప్రశ్నకి సమాధానం అప్పుడు అర్థమవుతున్నట్టు తోచింది!

"ఎన్నెన్ని వ్యాపారాలు పెడితిరి- మొగుడూ, పెళ్ళామూ. కేటరింగ్ అంటిరి, చీరెల వ్యాపార మంటిరి, ఫ్యాన్సీ షాపంటిరి... ఒకటా, రెండా? రానూ, నెత్తిన కూర్చుని అప్పు చేయించి మరీ ఊడ్చుకుపోనూ!" మాట్లాడుతూనే, ఏదో గుర్తుకొచ్చినట్టు పెరట్లోకి వెళ్లింది వదిన.

"ఆ విషయాలన్నీ తవ్వుకుని ఘోషపెట్టి ఉపయోగమేమిటి గానీ, ఒక్కటే మాటరా... నా వల్ల కాదు!" అన్నయ్య తెగేసి చెప్పాడు.

వదిన వచ్చింది- "నీ చెల్లెలు సరళ పెళ్ళి కాలేదింకా. ఆ ఆలోచనతోనే కంటికి కునుకు లేదు. ఇప్పుడు స్వరాజ్యమూ పెద్దపిల్లయింది. పిల్లవాడి చదువూ వుంది. రేపీ సంసారం వీధిన పడకుండా చూసుకోవలసిందీ మేమేగా?"

సమాధానం ఏం చెప్పగలను? వాస్తవాలు చేదు మాత్రలు!

"ఎవరి దారి వాళ్ళు చూసుకోవాల్సిందే... చెప్పేదేం లేదు!" ఇబ్బందిగా మొహం పెట్టాడు అన్నయ్య.

క్షణాల తర్వాత వదిన అన్నది- "మాకు మాత్రం వచ్చేదెంత? ఖర్చెంత. నువ్వేమీ తెలీనివాడివి కాదుగా! అన్ని పెట్టుపోతలకీ అన్నయ్యేగా కనిపించేది! మీ అక్కలకి చేయాల్సినవన్నీ చేసినా... చివరికి అది చాల్లేదనీ, ఇది సరిగా లేదనీ ఏదో వాక సొద్దు మాకు!" నిష్ఠూరం బాగానే ధ్వనించింది మాటల్లో.

క్రితంసారి సంక్రాంతికి అందరూ చేరితే కొత్తబట్టలు పెట్టింది వదిన. వసంత తనకి పెట్టిన చీరెని ఆడపడుచులకి పెట్టిన దానితో పోల్చుకుని వదిన తనని కించపరచిందని నసిగింది. ఆ సంఘటన వదినకి గుర్తుండటం అసహజమేమీ కాదు. అయినా ఇప్పుడు ఆమె ఎత్తిపొడుపు మనసుకి ముల్లులా గుచ్చుకుంది.

ఏమీ మాట్లాడలేకపోయాను. ఆలోచనలు... వసంతకి సిజేరియన్ అవసర మవుతుందని ముందే చెప్పారు డాక్టర్లు. వాళ్ళిచ్చిన తేదీ దగ్గరపడింది. రెండు రోజులుంది.

ఏం చేయాలిప్పుడు? ఇలా ఎందుకు జరుగుతోంది?

దిక్కులు చూస్తున్నాను. చేసిన వ్యాపారాలూ, ఏవీ కలిసి రాలేదు. అన్నిటా సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి అయింది. అప్పు తీసుకున్న వాళ్ళు తిరిగి ఇవ్వలేదు. అప్పిచ్చిన వాళ్ళు చెవులు మెలేసి మరీ వసూలు చేసుకున్నారు.

అన్నయ్య ఇంటినుంచి వచ్చేస్తుంటే నాతోపాటు బయటికి వచ్చిన సరళ నెమ్మదిగా అన్నది, "వదిన దగ్గర అసలు డబ్బు లేకపోవటం కాదుగానీ, నీకివ్వదలచుకోలేదు" అని.

ఎందుకని? ఇస్తే తిరిగి రాదనే గదా?! కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లనిపిస్తోంది. పెదవులు అదురుతున్నై. ఏడుపు దిగమింగుకుంటున్న స్పృహ. గుండెల్లో బరువుగా వుంది.

నాన్న జీతం గురించి వేసిన ప్రశ్నే మళ్లీ కళ్ళముందు నిలిచింది.

సావిత్రి, సీత, అనసూయ ముగ్గురి అక్కయ్యల్నీ పలకరించాను. ముగ్గురూ పరమ పతివ్రతలు. ఆ పతిదేవుళ్ళు లోపలా, బయటా కూడా చీకటినే చూపించారు.

"మా అవస్థలేవో మేం పడుతున్నాం. మరొకళ్ళని ఆదుకునేంత స్తోమతుంటే ఇంకేం... బాగానే వుండేది!" - పెద్దబావ.

"రోలు పోయి మద్దెలతో మొర పెట్టుకున్నట్టుందోయ్. సీత నడుగు- చెప్తుంది. మా వాణ్ణి ఎమ్‌సెట్‌లో చేర్చటానికి మీనమేషాలు లెఖ్ఖపెడుతున్నాం!" - రెండో బావ.

"వ్యవసాయం లాటరీ అయిపోయిందోయ్! మనసున్నా మార్గంలేని వాళ్ళం. ఏమీ అనుకోకు!" అనసూయ వాళ్ళాయన.

కళ్ళు ప్రేమతో చెమర్చినట్టా? లౌక్యమా? సానుభూతా? తెలీదు!

బాల్యమిత్రుడు బ్యాంక్ ఉద్యోగి. "ఏమయిందిరా... బాగా డస్సిపోయినట్టున్నావ్. మొహం పీక్కుపోయింది. ఏం చేస్తున్నావిప్పుడు?" అంటూ ఆప్యాయంగా స్వాగతించాడు. కేంటీన్‌లో టిఫిన్, కాఫీ అయినై. విషయం తేల్చాడు-

"చాలా స్ట్రెస్ అండ్ స్ట్రెయిన్‌లో వున్నాన్రా. నా భార్యకి డెలివరీ డేస్. హాస్పిటల్‌లో వుంది. నా ఫస్ట్ ఇష్యూ మెంటల్లీ రిటార్టెడ్. పుట్టబోయే బిడ్డ గురించి భయంగా, ఆందోళనగా వుంది. నేనేం హెల్ప్ చెయ్యలేను. సారీ!" కొంచెం దగ్గి, గొంతు సవరించుకుని, చేయి కలిపి సెలవు తీసుకున్నాడు.

●

గుంటూరు బస్ స్టేషన్ !

లైట్లు వెలిగాయి. చిరుచిరు చలిగా వుంది. తోచటం లేదు. తిరగటం అయిపోయింది. కాళ్లు పీకుతున్నై. కుర్చీలో జారగిలి కూర్చున్నాను.

విజయవాడ బస్‌లు. నాన్‌స్టాప్, ఎక్స్‌ప్రెస్, ఎఱ్ఱ బస్, ఆ పక్కగా మరో పల్లెవెలుగు, వరుసగా నిలబడి ఆహ్వానిస్తున్నై.

ఇంటికి వెళ్లి ఏం చేయాలి? వసంత ఎదురుచూస్తూ వుంటుంది. ఏ క్షణాన్నయినా హాస్పిటల్‌లో అడ్మిట్ చేయాల్సి రావచ్చు.

"నువ్ సెప్పావని వత్తన్నా గానీ, నాకేం... నాకేం నమ్మకం లేదే!"

మాటలు వినపడి చూశాను.

కుర్చీల వరసకు ముందు నేల మీద వయసు మళ్లిన దంపతులు. చిరిగిపోయిన పల్లెబతుకు బొమ్మల పటాల్లా వున్నారు. పక్కన గుడ్డలమూట, ఆయన చేతికఱ్ఱ, మంచినీళ్ల బాటిల్.

"కోడలికేవన్నా సాయం సేద్దామనున్నా... అదే వొప్పుకోడే! ఏందో నీ ఆశ. కానీ చూద్దాం!" ముసలయ్య మాటలకి మొగుడి కళ్ళల్లోకి చూసిందామె.

"చూద్దాం- నాయన రోగానికన్నా సాయం సేయకబోతే... యింకెందుకంటా యీ కొడుకులు?" అన్నదామె.

క్షణాల తర్వాత ముసలాయనే చెప్పుకొచ్చాడు -

"ఇయ్యాల మనూళ్ళో కొండయ్య మూడో కూతురు లేదూ... ఆ చంద్రమ్మ-దాని పెళ్ళి రాతిరికి. కొండయ్య తమ్ముడు అప్పయ్యదే కట్టమంతా. ఆడు పెళ్ళి సేసుకోకుండా, అన్న పిల్లల్ని బుజాన్నేసుకుని సాకాడు. కొండయ్య కొడుకు- అదే సూరాయంటాం గదే... అణ్ణి. ఆడూ, ఢిల్లీలో పెద్దుజ్జోగంట, చెల్లెలి పెళ్లికి రావటం లేదంట. మొహం చాటేశాడ్లే. ఇట్టాగున్నాయ్ పిచ్చిమొకమా- చుట్టరికాలన్నీ!"

"డబ్బు మదుసులైపోతార్లే యీ కాలపోళ్ళంతా."

"ఈ రోగమేందో, ఆడికాడికి లగెత్తడమేందో, సూద్దాం కానీ..." బాటిల్‌లో నీళ్లు తాగుతున్నాడు ముసలాయన.

"విజయవాడ, విజయవాడ!" కండక్టర్ అరుస్తున్నాడు బస్ డోర్ దగ్గర- తల బయటికి పెట్టి. డ్రైవర్ బస్ స్టార్ట్ చేసి రివర్స్ చేస్తున్నాడు.

వసంత రూపం కళ్ళముందు మెదిలింది. లేచి, త్వరగా బస్ ఎక్కేశాను.

●

ఇల్లు తాళం వేసి వుంది! పక్కింటావిడ 'కీ' ఇస్తూ చెప్పింది -

వసంతకి సాయంత్రం ఆరింటికి నొప్పులు మొదలైనై. ఉషారాణి డాక్టర్ హాస్పటల్‌కి వెళ్లింది. "ఆమె మీకు తెలిసిన డాక్టరట గదా!" అన్నది.

మనస్సులో ఆందోళన, కాళ్లల్లో త్వర. హాస్పిటల్‌లో పడ్డాను.

వసంత ఆపరేషన్ థియేటర్‌లో వుందన్నారు. ఆపరేషన్ థియేటర్ వున్న ఫ్లోర్‌కి వెళ్లాను. కారిడార్‌లోకి చేరాను.

ప్లాస్టిక్ బుట్ట, ఫ్లాస్క్‌తో బెంచ్‌మీద వదిన! ఆమె పక్కగా మా చిట్టి! మాట పెగల్లేదు!

●

'మా నవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనా? పాత సినిమా 'సంసారం' కథేనా? మళ్లీ మళ్లీ అవే గాథలా?'

ఆలోచిస్తూ, ఎవరో వదిలేసి పోయిన దినపత్రిక తిరగేస్తున్నాను. చదివాను.

ఎవరో రచయిత చాలా సూటిగా, స్పష్టంగా వ్యాసం రాశాడు– 'ఆనాడు కొ.కు. రాసిన మధ్యతరగతి కాలక్రమంలో ఏమయింది?' అనే ప్రశ్నని చర్చిస్తున్నాడు!

నవ్వొచ్చింది.

'మమ్మల్ని చూడు బాబూ...' అని చెబుదామనిపించింది!

"మీకు ఆడపిల్ల పుట్టిందండీ... కంగ్రాట్స్!" అంటూ వచ్చింది నర్స్!!

●

' చినుకు ' మాసపత్రిక